(PRGI NO: APTEL / 2023 / 88653)
పబ్లిక్ వ్యూ
తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY
విలేకరులు కావలెను
తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న పబ్లిక్ వ్యూ తెలుగు దినపత్రికకు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిపోర్టర్లు కావలెను.
మీ రెజ్యూమ్ కింద వాట్సాప్ నెంబర్ కు పంపండి
9701132982

(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 252 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి ఆదివారం 31 మే 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :252 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI SUN 31 MAY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur



## ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

- ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నారంటూ ప్రచారం
- నిరసనలకు దిగిన ఎంప్లాయీస్ యూనియన్
- ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న రాంప్రసాద్ రెడ్డి

- మిగతా 2లో

## ప్రణయ్ ప్రకాశ్ విలాసాలు, నగదు కట్టల గుట్టు విప్పిన సిట్ ఛార్జిషీట్!

### ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను ఏసీబీ కోర్టుకు సమర్పించిన సిట్

### డిస్టిలరీల నుంచి వందల కోట్ల వసూళ్లు

### దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస

పబ్లిక్ వ్యూ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ దర్యాప్తులో అత్యంత కీలకమైన మైలురాయి నమోదైంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం... ఏసీబీ కోర్టులో మరో అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ తాజా ఛార్జిషీట్‌లో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను సిట్ ఆధారాలతో కోర్టు ముందు ఉంచింది. సిట్ సమర్పించిన నివేదిక ప్రకారం.. వివిధ డిస్టిలరీల నుంచి వందల కోట్ల రూపాయల మేర వసూళ్లకు పాల్పడిన వ్యవహారంలో ప్రణయ్ ప్రకాశ్ అత్యంత కీలక సూత్రధారిగా వ్యవహరించారు. ఈ వసూళ్ల పర్వంలో ఆయన ఒంటరిగా

- మిగతా 2లో




## జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

### అది చాలా మంచి రోజన్న వాస్తు నిపుణుడు

- సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక
- ప్రమాణ స్వీకారం ఖరారు చేసిన వాస్తు నిపుణుడు గురూజీ ఆరాధ్య
- జూన్ 3 సాయంత్రం 5:15 గంటలకు వృశ్చిక లగ్నంలో కార్యక్రమం

పబ్లిక్ వ్యూ డెస్క్:డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు. శివకుమార్ నివాసం వద్ద మీడియాతో

- మిగతా 2లో





ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం..

## భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం

ఆధునిక యుద్ధ క్షేత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని

- మిగతా 2లో

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన

- మిగతా 2లో



## ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ



### అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ ప్రశంసలు

- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక కీలక శక్తి అని కొనియాడిన అమెరికా
- సింగపూర్‌లోని షాంగ్రి-లా సదస్సులో యూఎస్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వ్యాఖ్యలు
- భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరిస్తోందని ప్రశంస
- మిత్రదేశాలు రక్షణ వ్యయాన్ని పెంచాలని అమెరికా పిలుపు

పబ్లిక్ వ్యూ డెస్క్::ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక 'శక్తివంతమైన దేశం' అని, ప్రాంతీయ బలాల సమతుల్యతకు కీలకమైన శక్తిగా నిలుస్తోందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్

- మిగతా 2లో

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

- మిగతా 2లో



## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

- రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను
- చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం
- అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం
- పశ్చిమ అలజడుల కారణంగానే ఈ తుఫానులు అని వెల్లడి
- ప్రస్తుతానికి ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు

- మిగతా 2లో





## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం

పబ్లిక్ వ్యూ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు.ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన

- మిగతా 2లో



# గొడ్డలి పార్టీ.. అరాచకత్వం

### వైఎస్ జగన్‌ది హత్యా రాజకీయమే

- ఇప్పడిప్పుడే ఆయన అరాచకాలు వెలుగులోకి..
- కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యం పుస్తకం చదివితే నిజాలు తెలుస్తాయి.
- తుపాకీ పట్టడంతో మావోయిస్టులు విజయం సాధించలేకపోయారు
- హింసతో ఎవరు ఏమీ సాధించలేరు
- అమరావతి మీడియా సమావేశంలో చంద్రబాబు

- మిగతా 2లో

పబ్లిక్ వ్యూ డెస్క్:గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి"



ఖరీఫ్ సాగునీటి సరఫరాపై

## కీలక నిర్ణయాలు మంత్రి కందుల దుర్గేష్!

- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీ టి సరఫరాను క్రమబద్ధీకరిం చేందుకు నీటిపా రుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

- మిగతా 2లో

# గొడ్డలి పార్టీ.. అరాచకత్వం

- మొదటి పేజీ తరువాయి

"నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు. తెదేపా ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటినుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం. ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే ఎవరికీ నష్టం ఉండదు" అని ముఖ్యమంత్రి తెలిపారు.

బక్కని నర్సింహులు వ్యాఖ్యలు సరికాదు: చంద్రబాబు

తెదేపా జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరీ మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయన్ను కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్‌రావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ

- మొదటి పేజీ తరువాయి

ప్రశంసించారు. సింగపూర్‌లో శనివారం జరిగిన 'షాంగ్రి-లా డైలాగ్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే అతిపెద్ద రక్షణ, భద్రతా వేదిక అయిన ఈ సదస్సులో హెగ్సెత్ మాట్లాడుతూ, భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరించుకుంటోందని అన్నారు. "ఉన్నత స్థాయి సైనిక కార్యకలాపాలను నిర్వహించేందుకు భారత్ భారీ పారిశ్రామిక, లాజిస్టిక్స్ సామర్థ్యాలను నిర్మించుకుంటోంది. దక్షిణాసియాలో, ప్రాంతీయ సమతుల్యతను కాపాడటంలో భారత్ ఒక కీలక శక్తి. శక్తివంతమైన భారత్ తన సొంత ప్రయోజనాల కోసం పనిచేయడంతో పాటు, ఈ ప్రాంతంలో బలాల సమతుల్యతను కాపాడాలనే మా ఉమ్మడి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళుతోంది" అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా-భారత్ మధ్య పెరుగుతున్న రక్షణ సహకారాన్ని, ముఖ్యంగా సైనిక సామర్థ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సంయుక్త కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసిన హెగ్సెత్, మిత్రదేశాలు భద్రతా బాధ్యతల్లో మరింత పాలుపంచుకోవాలని, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని దేశాలు తమ జీడీపీలో 3.5 శాతం రక్షణకు కేటాయించాలని ఆయన సూచించారు.

ఇరాన్ వంటి ఇతర అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారించినప్పటికీ, ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికాకు ఉన్న ప్రాధాన్యం తగ్గలేదని ఆయన స్పష్టం చేశారు. 2025లో భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ ఒప్పందం పునాదిగా ఈ సహకారం మరింత బలపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రణయ్ ప్రకాశ్ విలాసాలు, నగదు కట్టల గుట్టు విప్పిన సిట్ ఛార్జిషీట్!

- మొదటి పేజీ తరువాయి

కాకుండా, లూప్‌లో ఉన్న పలువురు ప్రభావవంతమైన వ్యక్తులతో కలిసి ఒక సిండికేట్‌గా పనిచేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ప్రణయ్ ప్రకాశ్ మద్యం అక్రమ సంపాదనతో ఎలాంటి విలాసవంతమైన జీవితాన్ని గడిపారనేది సిట్ ఛార్జిషీట్‌లో వివరంగా పేర్కొంది. వైసీపీ నేత చెవిరెడ్డితో కలిసి పలుమార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డితో కలిసి చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తూ, దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ కోట్లాది రూపాయలు విలాసాలకు తగలేసినట్లు సిట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన మరో దిగ్భ్రాంతికరమైన అంశం ఏమిటంటే... మద్యం అక్రమ లావాదేవీల ద్వారా వసూలైన లెక్కల్లో లేని భారీ నగదును దాచడానికి నిందితులు ఒక ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పలు నగరాల్లోని విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను కేవలం నగదు దాచడానికే అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్లలోని రహస్య ప్రదేశాల్లో పెద్ద ఎత్తున నగదు కట్టలను భద్రపరిచినట్లు సిట్ ఆరోపించింది.

ఈ గుట్టు మొత్తాన్ని సిట్ అధికారులు పక్కా టెక్నికల్ ఆధారాలతో బట్టబయలు చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల నుంచి సేకరించిన డేటాను డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ చేయడం ద్వారా ఈ వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్ డేటా, వాట్సాప్ చాట్‌లను సమగ్రంగా క్రోడీకరించి ఏసీబీ కోర్టుకు సమర్పించారు. సిట్ దాఖలు చేసిన ఈ తాజా ఛార్జిషీట్ ఆధారంగా రాబోయే రోజుల్లో మరికొందరు కీలక నేతలకు, అధికారులకు నోటీసులు వచ్చే అవకాశం ఉందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది.

# జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపరిచారు.

### ఖరీఫ్ సాగునీటి సరఫరాపై
# కీలక నిర్ణయాలు

- మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయీస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో వైసీపీ కూడా పాల్గొంది. మరోవైపు, ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

# దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

# రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

# జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.

ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు

చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

# సంపాదకీయం

### నాగబాబు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
## చేస్తున్నారా? నిజమెంత?

జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు రాజ్యసభ పదవి దక్కే అవకాశాలున్నాయి. జనసేనకు కేటాయించే ఒక్క దానిని నాగబాబుకు ఇవ్వాలని పవన్ డిసైడ్ అయినట్లుంది. ఈ మేరకు పార్టీలో ప్రచారం జరుగుతుంది. నాగబాబు ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ అనేక సమీకరణాలతో ఆ ప్రతిపాదనను పవన్ కల్యాణ్ పక్కన పెట్టేశారు. నాగబాబుకు ఇక మంత్రి వచ్చే అవకాశం లేదు. అందుకే ఆయనను పెద్దల సభకు పంపితే ఢిల్లీ స్థాయిలో పార్టీకి, తనకు అండగా ఉంటారని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇందుకు నాగబాబు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**అనేక కారణాలతో...**

నాగబాబుకు మంత్రి పదవి వస్తుందని ఇటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, అటు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా మీడియా ఎదుట బహిరంగంగానే చెప్పారు. కానీ సామాజికవర్గాల సమీకరణ నాగబాబు మంత్రి పదవికి అడ్డంకిగా మారింది. ఇప్పటికే జనసేనకు చెందిన ఇద్దరు కేబినెట్ లో ఉన్నారు. పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్ ఉండటంతో నాగబాబుకు కూడా మంత్రి పదవి ఇస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని పవన్ కల్యాణ్ ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే తనను ఒక కులానికి పరిమితం చేయవద్దని పదే పదే చెబుతుండటం కూడా ఈ ప్రచారానికి కొంత ఊతమిస్తుంది.

**ఎప్పుడో దక్కాల్సి ఉన్నా...**

నాగబాబుకు ఎప్పుడో మంత్రి పదవి దక్కాల్సింది. అయితే పవన్ కల్యాణ్ అన్ని రకాలుగా ఆలోచించి నాగబాబును కేబినెట్ లోకి తీసుకోకూడదని నిర్ణయించారని సమాచారం. నాగబాబును కాకుండా మరో బీసీ వర్గానికి మంత్రి పదవి ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కొంత రాజకీయంగా ఉపయోగంగా ఉంటుందన్న అంచనాతో నాగబాబును ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి రాజ్యసభకు పంపాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. తన సోదరుడికి ఆ పదవి ఇస్తే కొంత గౌరవం కూడా ఇచ్చినట్లవుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే దీనిపై ఇంకా అధికార ప్రకటన రాకపోయినప్పటికీ జనసేన పార్టీ రాజ్యసభ పదవి లింగమనేని రమేష్ కు కాకుండా నాగబాబుకు ఇవ్వాలని డిసైడ్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజమెంత అనేది త్వరలోనే తెలియనుంది.

# మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

## ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం.. భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం

- మొదటి పేజీ తరువాయి

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న యుద్ధ తంత్రంలో వస్తున్న సంక్లిష్టతలను అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు తప్పనిసరిగా అవసరం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రాలు భారీ స్థాయిలో సమాచారాన్ని సృష్టిస్తున్నాయని, అనేక రకాల వనరులు ఇందులో భాగమవుతున్నాయని జనరల్ ద్వివేది వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో కమాండర్లు, సైనికులు వేగంగా సమాచారాన్ని విశ్లేషించి, తక్షణమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "యుద్ధ వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అదనపు సాంకేతిక మద్దతు అవసరం. ఇక్కడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం ఏర్పడుతుంది. భారీ వనరులను ఒకేసారి నియంత్రించడం కష్టమైనప్పుడు ఏఐ సాయపడుతుంది" అని ఆయన తెలిపారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో 'అబ్జర్వ్, ఓరియెంట్, డిసైడ్, యాక్ట్' (ఓఓడీఏ) అనే సైకిల్ ఉంటుందని, సంక్లిష్ట పరిస్థితుల్లో దీనిని వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడానికి, వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి దోహదపడతాయని అన్నారు. ఇదే సమయంలో సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల పాత్ర కూడా గణనీయంగా పెరిగిందని జనరల్ ద్వివేది హైలైట్ చేశారు. "ప్రస్తుత వాతావరణంలో, శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు అధికంగా ఉంది. వాటిని ఎదుర్కోవడానికి మనకు కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు అవసరం. అదే సమయంలో, మన డ్రోన్లను కూడా సమర్థంగా ఉపయోగించుకోవాలి. యుద్ధ క్షేత్రంలో వనరులు భారీగా పెరిగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్లు, సెన్సార్లు, నిఘా పరికరాలు వంటి వాటిని సమర్థంగా నిర్వహించడానికి ఆటోమేషన్ తప్పనిసరి అని, ఇందుకు ఏఐ కీలకమైన సాధనంగా నిలుస్తుందని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు.

# శ్రీ చింతామణి అమ్మవారిని దర్శించుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం.



**కవిటి(పబ్లిక్ వ్యూ)మే30:**

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీ చింతామణి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం,జడ్పీ చైర్ పర్సన్ పిరియా.విజయమ్మ చింతామణి అమ్మవారిని శనివారం దర్శించుకున్నారు.దర్శనం అనంతరంఆయనమాట్లాడుతూ రాష్ట్రప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్చార్జ్ సాడి.సాంప్రసాద్ రెడ్డి,రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు. నరేంద్ర, కంచిలి ఎంపీపీ దేవదాసురెడ్డి,ఇప్పిలి.కృష్ణారావు,పూడి.నేతాజీ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహనకు మెగా మైక్ ఫోన్ల పంపిణీ



**గంగవరం, పబ్లిక్ వ్యూ: మే 30::**గిరిజన గ్రామాల్లో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అడ్డతీగల సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి (ఎస్‌డీఎఫ్‌వో) జె.వి. సుబ్బారెడ్డి శనివారం అటవీ శాఖ సిబ్బందికి మెగా మైక్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగవరం మండలంలోని ఆర్డిపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిసర ప్రాంతాల్లో పులి సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో వన్యప్రాణుల సంచారం, అటవీ సంరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సకాలంలో సమాచారం అందించేందుకు మెగా మైక్ ఫోన్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న అటవీ శాఖ సిబ్బందికి ఈ మెగా మైక్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పోక్స్ పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు ,తదితరులు పాల్గొన్నారు.

## గజ్జరం చెరువులో తాడిచెట్టు లోతులో మట్టి తవ్వకాలు-జాడలేని అధికారులు





**తాళ్ళపూడి, పబ్లిక్ వ్యూ: మే 30::**తాళ్ళపూడి మండలంలోని గజ్జరం పంచాయతీ పరిధిలోని కిట్టమ్మ చెరువులో మట్టి తోలకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ తోలకాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయో, లేదో తెలియదు. కాని తాడిచెట్టు లోతులో మట్టిని తవ్వేస్తున్నారు. ఒకవేళ అనుమతులు ఉంటే కొంత లోతు వరకు ఉంటుంది. గజ్జరం గ్రామంలో ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థుల నుండి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు చెరువును పరిశీలించి, ప్రభుత్వ ఆస్తిని కొల్లగొట్టిన వారెవరో తెలుసుకొని, ఆస్తి రికవరీతో పాటు వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

## ప్రాణ రక్షణకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి

గంగవరం సెంటర్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ఎస్సై వెంకయ్య





**గంగవరం, పబ్లిక్ వ్యూ: మే 30:**రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహనదారుల ప్రాణ భద్రత దృష్ట్యా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గంగవరం ఎస్సై వెంకయ్య సూచించారు. ఈ మేరకు శనివారం గంగవరం సెంటర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకయ్య మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం కేవలం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అన్నారు. చాలా రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాల కారణంగానే ప్రాణనష్టం సంభవిస్తోందని, హెల్మెట్ ధరించడం ద్వారా అలాంటి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రత్యేక తనిఖీల సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించి, రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని వివరించారు.ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని ఎస్సై తెలిపారు. రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించి తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## జనసేన పార్టీలోకి ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గ ముఖ్య నాయకుల చేరిక..



### ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరిక

**పబ్లిక్ వ్యూ: మే 30:** జనసేన పార్టీ ఆశయాలు, సిద్దాంతాలు కోరుకొండ కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సమక్షంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బత్తుల వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు మరియు పార్టీ ప్రణాళికలకు ఆకర్షితులై ముఖ్య నాయకులు పార్టీలో చేరడం చాలా సంతోషకరమన్నారు. సామాజిక న్యాయం మరియు ప్రతి ఒక్కరి సంక్షేమం ధ్యేయంగా జనసేన పార్టీ కృషి చేస్తుందని, కొత్త నాయకుల చేరికతో మండలంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీలో చేరినవారు

జిల్లా ప్రెసిడెంట్ తూరపాటి వెంకటేశులు,జిల్లా వైస్ ప్రెసిడెంట్ చెన్నూరి రామస్వామి,జిల్లా సెక్రటరీ వానరాశి యాదగిరి ,జిల్లా సెక్రటరీ రామిశెట్టి గణేష్,దివాన్ చెరువు ప్రెసిడెంట్ తూరపాటి గణపతి,సెక్రటరీ వానరాశి యాదగిరి కోరుకొండ ప్రెసిడెంట్ తూరపాటి లోవరాజు కోరుకొండ సెక్రటరీ పేర్ల రాంబాబు ముఖ్య నాయకులు తూరపాటి వెంకన్న,వానరాశి వెంకటేశులు,చెన్నూరి గన్నియ్య,చెన్నూరి రామస్వామి, తూరపాటి గణపతి, పేర్ల శ్రీను,వానరాశి సుధాకర్,వానరాశి శ్రీను,కళ్యాణం నూకరాజు,కడమంచి రాజు,పేర్ల పాపారావు, వానరాశి లోవరాజు, చెన్నూరి వెంకటరమణ, వానరాశి ఈశ్వరావు, వానరాశి పెంటయ్య, వానరాశి వెంకటస్వామి, చెన్నూరి రాజు, మండలంలోని ముఖ్యమైన నాయకులు చేరారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, మండల అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్, బదిరెడ్డి దొర, శివరామకృష్ణ జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చెయ్యాలి



**తాడేపల్లిగూడెం. పబ్లిక్ వ్యూ: మే 30::**మెట్టఉప్పరగూడెం గ్రామం మోడల్ ప్రైమరీ స్కూల్ నందు నిర్వహించిన బడి పిలుస్తుంది లో భాగంగా స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం లో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి 1 వి.హనుమ ప్రభుత్వం అందిస్తున్న విద్యా కార్యక్రమాలు, పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యార్థుల భద్రత, విశాల క్రీడా మైదానాలు, అపార అర్హత, శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు చే భోదన డా.సర్వేపల్లి విద్యార్థి మిత్ర కిడ్స్,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, కార్యక్రమం అమలు పనితీరు ను తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలలోనే జరుగుతుంది అని తెలియజేశారు. ఐదు సంవత్సరాల వయసు నుండి 18 సంవత్సరాల వయసు వరకు విద్యార్థులందరూ బడిలోనే ఉండాలని తెలిపారు. మన ఊరు మన బడిని అభివృద్ధి పరచుటకి గ్రామస్థులు కలిసి రావాలి అని ఎమ్ ఈ ఓ కోరడం జరిగింది

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ నాగుల మీర, నాగమణి, కమల జ్యోతి, ప్రత్యూష, సి ఆర్ పి లు చందర్రావు నాని పాల్గొన్నారు

## ప్యాకేజీ -3 పార్కులను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం పబ్లిక్ వ్యూ: మే 30::**నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా మున్సిపల్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి ప్యాకేజీ-3 లోని పార్కులను పరిశీలించారు. సింహాచల నగర్ పార్క్, గాంధీపురం-4 లోని పార్కు, సుబ్బారావుపేట పార్కు, నారాయణపురం మునిసిపల్ పార్కు, ఆవాస పార్కు, జనార్ధన్ నగర్ పార్కులను సందర్శించి.. ప్రణాళికాబద్దంగా, ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది వాకింగ్ చేయడానికి అనుకూలంగా తగినంత స్థలం ఉండేలా వాకింగ్ ట్రాక్ లను విశాలంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కులోనూ కనీస వసతులు ఉండేలా చూడాలని, త్రాగునీరు, టాయిలెట్లు, లైటింగ్, ప్రహరీ, గేటు, సేదదీరడానికి బెంచీలు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఉండేలా చూడాలన్నారు. పార్కు విస్తీర్ణం, అనుకూలతను బట్టి షటిల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, జిమ్ పరికరాలు, పిల్లల ఆట పరికరాలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి వేళల్లో పార్కు సురక్షితంగా ఉండేందుకు విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి పార్కు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఏడీహెచ్ అనిత, ఏఈ సత్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## శ్రీరంగపట్నం బురద కాలువ సమస్యపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముందస్తు యాక్షన్ ప్లాన్..

-- రైతులకు పంట నష్టం రాకుండా కాలువ పూడికతీత పనులకు ఆదేశం



**కోరుకొండ, పబ్లిక్ వ్యూ: మే 30::**కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పరిధిలోని బురద కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, రైతులకు పంట నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రంగంలోకి దిగారు. కోరుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీరంగపట్నం ప్రాంత రైతులతో ఆయన శనివారం ఉదయం ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ ప్రాంతంలో బురద కాలువ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను, కాలువ పూడికలు పేరుకుపోవడం వల్ల పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు.

రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయానికి,రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. శ్రీరంగపట్నం బురద కాలువ సమస్య తీవ్రతను గుర్తించామని, వర్షాకాలం మరియు పంటల సీజన్ ప్రారంభం కాకముందే ముందస్తు జాగ్రత్తగా కాలువ మరమ్మత్తుల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ ని కలిసి శ్రీరంగపట్నం గ్రామంలో బురద కాలువ సమస్యను తక్షణమే పరిష్కరించాలని దానికి సంబంధించినటువంటి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన బురద, గుర్రపుడెక్క మరియు పూడికలను తక్షణమే తొలగించడానికి (పూడికతీతలు చేయించడానికి) అవసరమైన యంత్రాలను, సిబ్బందిని రంగంలోకి దించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పంటలు చేతికి వచ్చే సమయానికి లేదా భారీ వర్షాలు కురిసే సమయానికి కాలువ పొంగి పొర్లకుండా, రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లకుండా ముందస్తుగానే కాలువ గట్లను బలపరచడం, మరమ్మత్తులు చేయడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో శ్రీరంగపట్నం పరిధిలోని పలువురు రైతు ప్రతినిధులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో మండపేట యువకుడికి స్థానం

**కీ బోర్డ్ ప్లేయింగ్ లో అద్భుత ప్రతిభ చూపిన అభిరామ్**



**మండపేట. పబ్లిక్ వ్యూ: మే 30: :** మండపేట. పట్టణానికి చెందిన యువ కీబోర్డ్ వాయిద్యకారుడు మారే అభిరామ్ (18) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి మండపేటకు గర్వకారణంగా నిలిచాడు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు దండింగి అగస్టిన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక సంగీత కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2 వేల మంది కీబోర్డ్ వాయిద్యకారులు ఒకేసారి ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించగా, ప్రతిభ కనబరిచిన 777 మంది వాయిద్యకారులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు అర్హత సాధించారు. ఈ జాబితాలో మండపేటకు చెందిన మారే అభిరామ్ చోటు దక్కించుకోవడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభిరామ్ సాధించిన ఈ ఘనత పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, సంగీతాభిమానులు, స్నేహితులు, బంధువులు అభినందించారు. ఈ సందర్భంగా అభిరామ్ తల్లిదండ్రులు తమ కుమారుడు గిన్నిస్ రికార్డు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించి మార్గనిర్దేశం చేసిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు దండింగి అగస్టిన్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండపేట యువకుడు గిన్నిస్ రికార్డు సాధించడం పట్టణానికే గర్వకారణం అని పలువురు పేర్కొన్నారు.

## కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులు



**మండపేట పబ్లిక్ వ్యూ: మే 30:**మండపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు మండపేటలోనూ విస్తృతంగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో మండపేటను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రోజుకొక వార్డులో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తూ వీధుల్లోని డ్రైన్లు, మేజర్ డ్రైన్ లలో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్నారు. అలాగే రహదారుల పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరుస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రాజీవ్ గృహకల్ప కాలనీలోని ప్రధాన డ్రైన్లలో పేరుకుపోయిన చెత్తను, మురికి కాలువల్లోని సిల్ట్‌ను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్వో మాచిరాజు రవి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా ఆర్పీలు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## అన్నవరంలో భక్తుల జాతర:

**సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన జనసందోహం**





**అన్నవరం పబ్లిక్ వ్యూ: మే 30:**కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతపు సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు రత్నగిరి కొండకు తరలివచ్చారు. ?సత్యదేవుని వ్రతాలు ఆచరించడానికి దంపతులు పెద్ద సంఖ్యలో రావడంతో వ్రత శాలలన్నీ నిండిపోయాయి. భక్తుల రద్దీ కారణంగా సాధారణ దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. ?భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు క్యూ లైన్లలో మంచినీరు, పాలు పంపిణీ చేశారు. నిత్య అన్నదాన భవనంలో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ జరిగింది. ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం కావడంతోఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆగావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. ఈ ప్రాకార సేవా కార్యక్రమంలొ ఆలయ అర్చకులు ఆలయ మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సందోహంతో కిటకిటలాడిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్రం





**స్వయంభూ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు**

**ఆత్రేయపురం, పబ్లిక్ వ్యూ: మే 30:** :కోనసీమ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ర్యాలి ఐదు బుధవారాల శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం శనివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. భారతదేశంలోనే అత్యంత విశిష్టత కలిగిన శ్రీ జగన్మోహిని కేశవస్వామి స్వయంభూ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

తెల్లవారుజామున స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వామివారి మేలుకొలుపు సేవలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామివారి దివ్య దర్శనం కల్పించారు. స్వామివారిని వరుసగా ఐదు బుధవారాలు దర్శించి ప్రదక్షిణలు చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.


పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ క్షేత్రంలో ఒకే విగ్రహానికి ముందు భాగంలో శ్రీ మహావిష్ణువు కేశవ స్వరూపం, వెనుక భాగంలో జగన్మోహిని రూపం దర్శనమివ్వడం విశేషం. ఈ అపూర్వ శిల్పకళా వైభవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దర్శనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించింది. ఆలయంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి ఆలయ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించామని, క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టామని వారు తెలిపారు.

శనివారం సెలవుదినం కావడం, భక్తుల విశ్వాసం, క్షేత్ర మహిమ కలిసి ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయాన్ని భక్తి పారవశ్యంతో నింపాయి. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల రాకపోకలతో సందడిగా మారగా, క్షేత్రం ఆధ్యాత్మిక కాంతులతో మరింత శోభాయమానంగా కనిపించింది.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**జూన్ 17 నాటికి వందలాది మహిళలకు ఉపాధి కల్పనకు కార్యాచరణ**

**మహిళా అభ్యుదయ వేదిక అవగాహన సమావేశానికి విశేష స్పందన**

**రామచంద్రపురం పబ్లిక్ వ్యూ: మే 30:**మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి కల్పన,సాధికారత లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాల ద్వారా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.రామచంద్రపురం టౌన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మహిళా అభ్యుదయ వేదిక అవగాహన సమావేశంలో అమరావతి నుంచి ఫోన్ ద్వారా పాల్గొన్న మంత్రి సుభాష్ తన సందేశాన్ని అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా నిరుద్యోగులు, వితంతువులు, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉచిత శిక్షణలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.ఇటీవల నిర్వహించిన జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, సోప్ మేకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తదితర శిక్షణలను పూర్తి చేసిన మహిళలకు రుణ సదుపాయాలు కల్పించి చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహకరిస్తామని తెలిపారు. జూన్ 17 నాటికి 200 నుంచి 300 మంది మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు.

**పెట్టుబడి లేని మహిళలకు ఫౌండేషన్ అండ**

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మహిళా సాధికారతే తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు చేయూతనందించి, స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.మంత్రి సుభాష్ ఆలోచనలను తన కుమార్తె శ్రీ సత్య సహకారంతో కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టలేని మహిళలకు ఫౌండేషన్ అండగా నిలిచి అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందిస్తుందని చెప్పారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి వారి ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.జ్యూట్ బ్యాగ్స్, టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డిజిటల్ ప్రింటింగ్, సానిటరీ ప్యాడ్స్, సోప్ మేకింగ్, బ్యూటీషియన్, మైక్రో గ్రీన్స్, డైరీ ఫార్మింగ్, ఫోటోగ్రఫీ, పౌల్ట్రీ, క్రాబ్ ఫార్మింగ్, వాటర్ బాటిల్స్ ప్యాకింగ్, పేపర్ బ్యాగ్స్ తయారీ, కూరగాయల సాగు తదితర రంగాల్లో శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

**మహిళా సాధికారతకు అందరి సహకారం**

రామచంద్రపురం ఆర్డీవో సరళావతి మాట్లాడుతూ మహిళల ఉపాధి, సాధికారత కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే ఇటువంటి కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మెప్మా ద్వారా రుణాల మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. మహిళా అభ్యున్నతి కోసం మంత్రి సుభాష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.మంత్రి సుభాష్ సహోదరి శ్రీ సత్య మాట్లాడుతూ మహిళా సాధికారతను ఉద్యమ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళల ఉపాధి శిక్షణ కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. త్వరలోనే పలు స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరళావతి, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, గరికపాటి సూర్యనారాయణ, కట్టా నాగేశ్వరరావు,దంగేటి గౌరీశంకర్,జాస్తి విజయలక్ష్మి, వజ్రపు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏపీ పీజీసెట్--2026లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభా పతాకం





**గణితశాస్త్రంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కాళ్లకూరి నరేంద్ర శర్మ**

**టాప్-10లో ఎనిమిది ర్యాంకులు కైవసం**

**కాకినాడ, పబ్లిక్ వ్యూ: మే 30:** ఆంధ్రప్రదేశ్ పీజీసెట్--2026 ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో అగ్రస్థానాలు సాధించారు. ముఖ్యంగా గణితశాస్త్ర విభాగంలో కాళ్లకూరి నరేంద్ర శర్మ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పీజీ ప్రవేశ పరీక్షల్లో తమ విద్యార్థులు విశేష ఫలితాలు సాధించడం ఆనందదాయకమన్నారు.

గణితశాస్త్ర విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకుతో పాటు టాప్-10లో ఎనిమిది ర్యాంకులు సాధించడం విశేషమని పేర్కొన్నారు.గణితశాస్త్ర విభాగంలో కాళ్లకూరి నరేంద్ర శర్మ ప్రథమ ర్యాంకు, బాల ఫణీంద్ర కుమారి ద్వితీయ ర్యాంకు, కె. జ్యోతిక మరియు డి. అమృత సాయివల్లి నాలుగో ర్యాంకు, ఎం. నాగదుర్గ ఆరో ర్యాంకు, కె. మహాలక్ష్మి ఏడో ర్యాంకు, ఎస్. భవాని ఎనిమిదో ర్యాంకు సాధించారు. అలాగే బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన సి. గీత నందిని ఎనిమిదో ర్యాంకు సాధించారు.అదనంగా 11 నుంచి 100 ర్యాంకుల పరిధిలో గణితశాస్త్ర విభాగంలో 17 మంది, కంప్యూటర్ సైన్స్‌లో 21 మంది, స్టాటిస్టిక్స్‌లో 6 మంది, కెమిస్ట్రీలో 4 మంది, ఇంగ్లీష్‌లో 3 మంది, లైఫ్ సైన్సెస్‌లో 2 మంది, కామర్స్‌లో 3 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు.

ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా. ఎన్. శేషారెడ్డి టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన అధ్యాపకులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 100 శాతం ఉద్యోగాలు సాధించడమే కాకుండా, పీజీసెట్‌లోనూ అత్యుత్తమ ర్యాంకులు సాధించడం విద్యార్థుల కృషికి నిదర్శనమన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన కాళ్లకూరి నరేంద్ర శర్మతో పాటు ఇతర టాప్ ర్యాంకర్లను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి డా. ఎన్. సుగుణా రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

# మురుగు నీరు కోసం డెడికేటెడ్ ఛానల్ ఏర్పాటు చేయాలి

- కడియం పేపర్ మిల్ లాకౌట్ ఎత్తివేతపై ఆగ్రహం
- ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30::**నగర కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించి సమీక్ష తర్వాత కదలిక వచ్చిందని సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి అన్నారు. ఏపీ పేపర్ మిల్లు కాలుష్యం, నగర, రూరల్ కాలుష్యం, పారిశ్రామిక కాలుష్యం ప్రమాదకరంగా తయారైందని గోరంట్ల చెప్పారు. నగర మురుగు నీరును శుద్ధిచేసి గోదావరిలో ధవళేశ్వరం బ్యారేజ్ దిగున లంకల్లో వదిలేలా డెడికేటెడ్ ఛానల్ నిర్మాణం అవసరమని అన్నారు. ఇందుకోసం రూ.440 కోట్ల రూపాయలతో ప్రతిపాదన సిద్ధం చేస్తామన్నారు. గోదావరి లో నగర మురుగునీరును కలవకుండా చూస్తేనే జలజీవన్ మిషన్లో రక్షిత మంచినీటిని ప్రజలకు అందించవచ్చునన్నారు. జలజీవన్ మిషన్ లో చేపట్టే పథకానికి ఇచ్చిన ఇరిగేషన్ స్థలంపై కొందరు సొసైటీ పేరుతో కోర్టుకెళ్లారని దాంతో ఇబ్బందులు ఎదురవుతాయని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు.

**కడియం పేపర్ మిల్ లాకౌట్ ఎత్తివేతపై ఆగ్రహం..**

కడియం బ్రాంచ్ ఏపీ పేపర్ మిల్లులో కొనసాగుతున్న లాకౌట్ ను కొంతమందిని తొలగించి ఎత్తివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడంపై మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తం చేసారు. గత నెల 27వ తేదీ నుంచి కడియం ఏపీ పేపర్ మిల్లులో కార్మికుల సమ్మెతో యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. అయితే కార్మిక సంఘాలకు యాజమాన్యానికి అనేక చర్చలు జరిగినప్పటికీ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాలేదు . తాజాగా 59 కాంట్రాక్ట్ కార్మికులను, వారికి మద్దతు తెలిపినందుకు 11 మంది రెగ్యులర్ కార్మికులను తొలగిస్తూ లాకౌట్ ను ఎత్తివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. దీనిపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన వారిని కూడా విధుల్లోకి తీసుకుని లాకౌట్ని ఎత్తివేస్తేనే అంగీకరిస్తామని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు.యాజమాన్యం వైఖరిని తీవ్రంగా ఖండించారు.

## నేడు 2.68 లక్షల మందికి పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లు పూర్తి

- జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30::**తూర్పు గోదావరి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జూన్ నెలకు సంబంధించి పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు.జిల్లాలో మొత్తం 2,68,564 మంది లబ్ధిదారులకురూ.118,84 కోట్లు విలువైన పెన్షన్లను జూన్ 1వ తేదీన ఇంటి వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మొత్తాలను పెంచిన నేపథ్యంలో వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకారులు, ఒంటరి మహిళలు తదితర వర్గాలకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, తీవ్ర వైకల్యం, పక్షవాతం, ప్రమాదాల కారణంగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అర్హులకు రూ.10,000 చొప్పున పెన్షన్లు అందజేయనున్నట్లు వివరించారు. డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి. నాగేష్ వివరాలు తెలియ చేస్తూ, జూన్ 1వ తేదీన జిల్లాలో కొత్తగా అర్హత పొందిన 231 మంది వితంతువులకు రూ.9,24,000 విలువైన పెన్షన్లను మొదటిసారిగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు**



**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30::** స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ లో పని చేస్తున్న స్వంత ఇళ్ల స్థలాలు లేని పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు కోరారు. శనివారం 14,15,16, వార్డులలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిటీ సమితి ఆధ్వర్యంలో దరఖాస్తులు రాశారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు అధికారం లోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున భూమి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అవుతాయని మధు గుర్తు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల లోపు మున్సిపల్ కార్మికులకు రెండు సెంట్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో భూ పోరాటం చేస్తామని మధు అన్నారు

సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనువాస్ స్పందించి మున్సిపల్ కార్మికుల కు ఇళ్లపట్టాలు ఇవ్వాలని మధు కోరారు

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం వెంకటేశ్వరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దానాల దుర్గమ్మ, కాకి శారద, సిటీ జే. సరస్వతి, వి సుకున కిలారి వీర వెంకటరావు అల్లం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా పోలీసు శాఖలో పదవీ విరమణ పొందిన అధికారులకు సత్కారం



**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30:**తూర్పుగోదావరి జిల్లా పోలీసు విభాగంలో పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్.నిర్వహించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పదవీ విరమణ చేసిన కె. ఆంజనేయులు, సబ్ ఇన్స్పెక్టర్ (జిల్లా స్పెషల్ బ్రాంచ్) ఆర్.డి. సోమేశ్వరరావు,అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (జిల్లా స్పెషల్ బ్రాంచ్) కొప్పిశెట్టి రామకృష్ణ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఉండ్రాజవరం), చిట్టిబొమ్మ వరప్రసాద్ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏ.ఏ.ఓ. జిల్లా పోలీసు కార్యాలయం) లను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ శాలువ కప్పి ఘన0గా సన్మానం చేసి సత్కరించి, జ్ఞాపికను అందజేసినారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వీరు పోలీస్ డిపార్ట్మెంట్ కు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడినారు. వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలియజేసినారు.

ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (ఎస్.బి) బి. రామకృష్ణ , డి.ఎస్.పి (ఏ.ఆర్) టి.ఆర్.కె రవి కుమార్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదం



**సెట్రాజ్ సీఈఓ ఎస్.వి.కె. కాశీ విశ్వేశ్వరరావు**

**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30:**విద్యార్థులు, యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.వి.కె. కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను శనివారం సెట్రాజ్ సీఈఓ ఎస్.వి.కె. కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డి.ఎం.ఎం. శేషగిరి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామచంద్రరావు సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో పాల్గొంటున్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఉషు విభాగాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను కలిసి వారి ప్రతిభను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ శిక్షణ కేంద్రాలను

సందర్శించారు. ఈ సందర్భంగా సెట్రాజ్ సీఈఓ మాట్లాడుతూ ఉషు వంటి ఆత్మరక్షణ క్రీడల్లో బాలికలు పాల్గొనడం అభినందనీయమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామచంద్రరావు మాట్లాడుతూ తమకు ఇష్టమైన క్రీడను ఎంపిక చేసుకుని వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండగలరని సూచించారు.జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డి.ఎం.ఎం. శేషగిరి మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో చేరిన క్రీడాకారులు క్యాంపు ముగిసిన తర్వాత కూడా సాధనను కొనసాగించాలని సూచించారు. క్రీడల్లో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణతో పాటు నిరంతర సాధన అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి వచ్చిన క్రీడా యాప్‌లో ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా లో49 మంది అభ్యర్థులు ఎంపిక

**జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష**




**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30::**తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు.

ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలైన క్లౌడ్ మెల్లో , సంధ్యా మెరియన్ కంపెనీలు పాల్గొని తమ సంస్థలలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. మొత్తం 125 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకాగా, వారి విద్యార్హతలు, నైపుణ్యాలు ప్రతిభ ఆధారంగా 49 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష తెలిపారు.జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ సి.హెచ్. రాజ్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పావని ప్రియా, నిరుద్యోగ యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఆపరేటర్లు, కోర్టు కానిస్టేబుళ్ల పనితీరుపై జిల్లా ఎస్పీ సమీక్ష



**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30:**తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలో నిర్వహించాల్సిన డేటా ఎంట్రీ, కేసుల రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ నమోదు, డిజిటల్ డాక్యుమెంటేషన్, కోర్టు కేసుల పురోగతి, సమన్లు వారెంట్ల అమలు, పెండింగ్ కోర్టు వ్యవహారాలపై సమీక్షించారు.

కోర్టు కానిస్టేబుళ్లు కేసుల విచారణలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొంటూ, సమన్లు వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, కేసు డాక్యుమెంట్ల సమర్పణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులు కోర్టు సిబ్బందితో సమన్వయం పెంపొందించడం ద్వారా కేసుల కన్విక్షన్ రేటును గణనీయంగా మెరుగుపరచవచ్చని సూచించారు. కంప్యూటర్ ఆపరేటర్లు పోలీస్ స్టేషన్లలో డేటా నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టి, సీసీటీఎన్ఎస్ ఇతర సాంకేతిక వ్యవస్థల వినియోగంలో లోపాలు లేకుండా పనిచేయాలని ఆదేశించారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసింగ్‌లో పారదర్శకత, పనితీరు మెరుగుపడుతుందని ఎస్పీ తెలిపారు. స్మార్ట్ పోలీసింగ్ అమలు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ, అధిక కన్విక్షన్ రేటు సాధన లక్ష్యాల కోసం పనిచేయలని ఆదేశించారు

## డీఆర్వో టి. సీతారామ మూర్తి ఉద్యోగ విరమణ

- డీఆర్వో సేవలు అభినందనీయం
- మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం, పబ్లిక్ వ్యూ: మే 30:**తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) టి. సీతారామమూర్తి గత ఏడాదిన్నర కాలంగా జిల్లా పరిపాలనలో అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం అనంతరం పదవీ విరమణ పొందుతున్న డీఆర్వో టి. సీతారామమూర్తిని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, జిల్లా పరిపాలనలో డీఆర్వో సీతారామమూర్తి అంకితభావంతో విధులు నిర్వహించారని, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యోగ జీవితంలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ అధికారులకు ఆదర్శప్రాయమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, సీతారామమూర్తి సుదీర్ఘ ప్రభుత్వ సేవలో ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేశారని కొనియాడారు.

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, రెవెన్యూ పరిపాలనలో సీతారామమూర్తి , బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని అన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, అధికారిగా మాత్రమే కాకుండా అందరితో సత్సంబంధాలు కలిగి పనిచేసిన వ్యక్తిగా సీతారామమూర్తి గుర్తుండిపోతారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. .

అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి డీఆర్వో టి. సీతారామమూర్తిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలి

-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజు.



**కిర్లంపూడి పబ్లిక్ వ్యూ: మే 30::** జూన్ 1 వ తారీఖున కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామంలో మండల బిజెపి కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు ఇంటి వద్ద నిర్వహించే భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజుబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శరణం రాజుబాబు మాట్లాడుతూ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పర్యవేక్షణలో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కావున మండలంలోని బిజెపి సీనియర్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని మండల కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా శరకణం రాజుబాబు పిలుపునిచ్చారు.

## విద్యార్ధులను దోచుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలు. -ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

-ఇండియన్ నేషనల్ యువజన పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు అబ్బిరెడ్డి గంగాధర్.






**కిర్లంపూడి, పబ్లిక్ వ్యూ: మే 30:** కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల కుటుంబాలను నిట్ట నిలువునా దోపిడీ చేయడమే కాకుండా, విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, సి. ఎస్.బి, ఐ.ఎ.ఎస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థి,ఇండియన్ నేషనల్ యువజన పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు అబ్బిరెడ్డి గంగాధర్ ఆరోపించారు.కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని అబ్బిరెడ్డి గంగాధర్ ఆధ్వర్యంలో మజ్జిగ చదివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అబ్బిరెడ్డి గంగాధర్ మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ యువజన పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రాలని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమిక విద్య నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలన్నారు. అబ్బిరెడ్డి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో
చీకట్ల సుబ్బు,బల్లా రాము, దుడ్డు గణేష్, దాసరి ప్రవీణ్, తుమ్మలపల్లి విష్ణు, అనుకుల దుర్గాజి, అనసూరి వంశీ, దుడ్డు గంగాధర్, బుగతా శివ, శ్రీపతి కాశీ,గుండుపల్లి కొండబాబు, పాఠంశెట్టి రాజేష్, శ్రీపతి సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్ వేధింపుల ఘోరం మహిళ ప్రాణం తీసిన దుశ్చర్య నిందితుడు నానిబాబు అరెస్ట్....



**శంఖవరం / రౌతులపూడి పబ్లిక్ వ్యూ: మే 30:-** సామాజిక మాధ్యమాలను కొందరు తమ వికృత చేష్టలకు వేదికగా మార్చుకుంటూ అమాయకుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. ఇలాంటి ఒక దుశ్చర్యే కాకినాడ జిల్లాలో ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది రౌతులపూడికి చెందిన నానిబాబు అనే వ్యక్తి ఒక మహిళకు సంబంధించిన అశ్లీల వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయడంతో, తీవ్ర మనస్తాపానికి గురైన సదరు మహిళ విష ద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించి చివరికి ప్రాణాలు కోల్పోయింది.
ఈ ఘోరానికి కారణమైన నిందితుడిపై మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తక్షణమే స్పందించారు. ఎస్ఐ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిందితుడు నానిబాబును శుక్రవారం అరెస్ట్ చేయడం జరిగింది. అనంతరం అతడిని తుని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, న్యాయస్థానం నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించిందని ఎస్ఐ వెల్లడించారు. సోషల్ మీడియాలో మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# జూన్ 1న సీఎం చంద్రబాబు తుని పర్యటన





### చామవరంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎంపీ, ఇన్‌చార్జి ఎస్పీ

**కాకినాడ/తుని, పబ్లిక్ వ్యూ: మే 30:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 1న తుని మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో చామవరం గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఇన్‌చార్జి ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి పర్యటన స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.ముఖ్యమంత్రి దిగే హెలిప్యాడ్, పార్టీ క్యాడర్‌తో సమావేశమయ్యే వేదిక, ప్రజా సభా ప్రాంగణం, కేడింగ్, ప్రవేశ ద్వారాలు తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, విఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిట్టింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పటిష్టంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సౌకర్యం, వైద్య శిబిరాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పింఛన్ పంపిణీ చేయనున్న లబ్ధిదారుని గృహాన్ని కలెక్టర్, ఎస్పీ బృందం సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. భద్రతా అంశాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.తదుపరి అతిథి ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం భద్రతా అధికారి కృష్ణారావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. సీఎం పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఎంహెచ్‌వో డా. జె. నరసింహ నాయక్, అదనపు ఎస్పీ సి. శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ పి. తిమ్మప్ప, డీఎఫ్‌వో సీహెచ్ కృపావరం, పెద్దాపురం ఆర్డీవో పి. కృష్ణమూర్తి, తుని ప్రత్యేక అధికారి ఎన్. శ్రీధర్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఫోటో క్యాప్షన్: చామవరం గ్రామంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎంపీ సానా సతీష్ బాబు, ఇన్‌చార్జి ఎస్పీ రాహుల్ మీనా మరియు ఇతర అధికారులు.



## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం..





### నిరు పేదల పక్షాన "మన ఊరు - మన బాధ్యత " ఫౌండేషన్...

**శంఖవరం /మెరక చామవరం పబ్లిక్ వ్యూ: మే 30::-** గ్రామం లో నిరుపేదల పక్షాన కష్టకాలంలో ఉన్నవారికి ఆర్థిక సహాయాలు అందించడమే లక్ష్యమని "మన ఊరు - మన బాధ్యత" ఫౌండేషన్ అధినేత పెదపాటి ఆనంద్ తెలిపారు.
కాకినాడ జిల్లా మెరక చామవరం లో స్థానిక అంబేద్కర్ కాలనీలో గురుజు నూకరాజు భార్య సోమలమ్మ మరియు సరిపల్లి నానిబాబు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను " మన ఊరు - మన బాధ్యత" ఫౌండేషన్ అధినేత పెదపాటి ఆనంద్, కొల్లా చిన్న, పెదపాటి సుధా జోషప్ పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు 25 కేజీల రైస్ బాగ్, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా " మన ఊరు - మన బాధ్యత " ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, మా స్వగ్రామమైన అంబేద్కర్ కాలనీలో గల నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పులి బాపిరాజు, జి. సింహాచలం, ఎమ్మిలి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ వజ్రపహార్‌లో 22 బైక్‌లు సీజ్



**కాకినాడ/సామర్లకోట, పబ్లిక్ వ్యూ: మే 30:** కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆపరేషన్ వజ్రపహార్'లో భాగంగా సామర్లకోట పట్టణంలోని అమ్మానమ్మ అపార్ట్‌మెంట్స్ పరిసర ప్రాంతాల్లో శనివారం భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 22 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఎబిజి తిలక్ పర్యవేక్షణలో సామర్లకోట ఇన్స్పెక్టర్ ఎ. కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి తనిఖీలు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సహాయంతో నివాస ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులతో పాటు ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించిన పోలీసులు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 22 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం స్థానిక ప్రజలకు సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రతా నిబంధనలు, హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అదేవిధంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.మత్తు పదార్థాలు సేవించి పట్టుబడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే ప్రజా మన్ననలు.

-డిప్యూటీ ఎంపీడీఓ, సత్య ప్రసాద్ పదవి విరమణ సన్మాన సభలో ఎంపీడీఓలు హరికృష్ణ, కుమార్ బాబు






**కిర్లంపూడి, పబ్లిక్ వ్యూ: మే 30::** ఏ ఉద్యోగి అయినా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజా మన్ననలు పొందుతారని కిర్లంపూడి, ప్రత్తిపాడు,ఎంపీడీఓలు బాయిశెట్టి హరికృష్ణ, ఎం వి ఆర్ కుమార్ బాబు అన్నారు. కిర్లంపూడి పంచాయతీరాజ్ డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేస్తున్న ఎన్ సత్యప్రసాద్ కు మండల పరిషత్ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీఓలు,బాయిశెట్టి హరికృష్ణ, ఎం.వి.ఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ కిర్లంపూడి మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చేస్తున్న ఎన్ సత్యప్రసాద్ సేవలను అభినందించడమే కాకుండా,సత్యప్రసాద్ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, సత్యప్రసాదను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు టి జోసెఫ్, మక్కా చిన్నారావు, ఏపీఓ నాయుడు, ఏపీఎం శరకణం వేదకుమారి,ఉపాధి జె ఇ, కుమారి,ప్రత్తిపాడు డిప్యూటీ ఎంపీడీఓ,కాశీ విశ్వనాథం, కిర్లంపూడి ఎంపీడీఓ కార్యాలయం పరిపాలన అధికారి ఎన్ఎంకేజి ప్రసాద్, కార్యాలయం సిబ్బంది ప్రసన్న, ధనుష్,తనోజ్,నాగేంద్ర, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జగన్ వార్నింగ్.. కేడర్ కు డబ్బు భయం? స్థానిక సమరంపై వైసీపీలో తర్జనభర్జన



పబ్లిక్ వ్యూ డెస్క్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయని అంటున్నారు. ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా రాష్ట్రంలో ప్రతి స్థానం నుంచి పోటీ చేయాలని వైసీపీ బాస్ జగన్ పార్టీ కేడర్ ను ఆదేశించారు. ప్రధానంగా ఏ నియోజకవర్గంలో అయినా పోటీకి అభ్యర్థులు లేరన్న సాకు చూపకూడదని, అవసరమైతే బీసీ, ఎస్సీ కార్యకర్తలను రంగంలోకి దింపాలని జగన్ రెడ్డి సూచించారు. దీంతో స్థానిక ఎన్నికల్లో పార్టీ పట్టు నిరూపించుకోవాలని జగన్ రెడ్డి తహతహలాడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో కేడర్ మాత్రం భిన్నంగా స్పందిస్తున్నట్లు అంతర్గత సంభాషణల్లో తెలుస్తోందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తున్న వైసీపీ కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోటీపై మాత్రం తీవ్ర తర్జనభర్జనకు గురవుతున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఎన్నికల వ్యవస్థ డబ్బు మయంగా మారిపోవడమే అంటున్నారు. చిన్న పంచాయతీలో సర్పంచ్ పదవికి పోటీపడాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు పెట్టాల్సివుంటుందని అంటున్నారు. అంత డబ్బు పెట్టి గెలిచినా, ప్రతిపక్షంలో ఉండటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంల ప్రస్తుతం నెలకొన్ని ఆర్థిక ఇబ్బందులు కూడా దిగువస్థాయి కేడర్ ను భయపెడుతోందని అంటున్నారు. రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినందున ఈ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంపై సానుకూల వాతావరణమే ఉందని ప్రభుత్వం చాటి చెప్పాలని అనుకుంటోంది. ఇదే సమయంలో వైసీపీ కూడా గట్టి వ్యూహంతోనే ముందుకు కదులుతోందని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడా అధికార పార్టీకి తలొగ్గామనే అభిప్రాయం వ్యక్తం కావొద్దని, ప్రతిచోట అధికార పక్షాన్ని దీటుగా ఢీకొట్టాలని వైసీపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఇంచార్జులను యాక్టివ్ చేసింది. ఎన్నికల్లో ప్రతి చోటా అభ్యర్థులను నిలిపే బాధ్యత నియోజకవర్గ ఇంచార్జిలకు అప్పగించింది. అయితే సర్పంచ్, ఎంపీటీసీ వంటి పదవులకు పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ డబ్బు సమస్యే వారిని ఊగిసలాటకు గురిచేస్తోందని చెబుతున్నారు. విపక్షంలో ఉండటం వల్ల గెలిచినా, గెలవకపోయినా పెద్దగా ప్రయోజనం ఉండదని ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడుతున్నట్లు చెబుతున్నారు. లక్షల రూపాయలు కుమ్మరించి పోటీ చేసి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకు? అన్న ఆలోచనలో ఎక్కువమంది ఉన్నారని అంటున్నారు. అయితే పార్టీ అగ్ర నాయకత్వం మాత్రం ఎట్టిపరిస్థితుల్లో పోటీ చేయాల్సిందే అని పట్టుబడటం వల్ల చాలా మంది నియోజకవర్గ ఇంచార్జిలు ఏమైనా సాయం చేస్తారా? అని ఆశగా ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో హైకమాండ్ స్పష్టత ఇస్తే క్షేత్రస్థాయిలో పోటీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

# ఫేక్ జీవోలతో రూ.1500 కోట్ల భూమికి ఎసరు? వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడిపై కేసు




పబ్లిక్ వ్యూ డెస్క్: హైదరాబాద్ లోని గండిపేటలో రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నించారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై నమోదైన కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుతోపాటు నలుగురు పరారీలో ఉన్నారని, మరో ముగ్గురిని అరెస్టు చేశామని శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన కబ్జాపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. ఇందులో ప్రమేయం ఉందంటూ మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడంతో ఆయన పరార్ అయ్యారని, ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారంగా మారుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం హైదరాబాద్ శివార్లలోని గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన భూములను కాజేందుకు కొందరు స్కెచ్ వేశారని స్థానిక ఎమ్మార్వో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో మొత్తం ఏడుగురి పాత్ర ఉందని గుర్తించగా, వారిలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు చేర్చడంతో రాజకీయ సంచలనంగా మారిందని అంటున్నారు. గండిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 18లో మొత్తం 104.25 ఎకరాలు ఉండగా, అందులో 9.28 ఎకరాలను గండిపేటకు చెందిన ఐదుగురు వ్యక్తులు తప్పుడు పత్రాలతో క్రమబద్ధీకరించుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ విషయం స్థానిక తహశీల్దార్ దృష్టికి వెళ్లిందని, ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్ ఫిర్యాదు చేశారని డీఎస్పీ వెల్లడించారు. దీంతో నార్సింగి పోలీసులతోపాటు సైబర్ క్రైం, ఆర్థిక నేరాల విభాగం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు నిర్వహించి కబ్జా కుట్రను భగ్నం చేసినట్లు డీఎస్పీ మీడియాకు వివరించారు. కాగా, వివాదంలో ఉన్న భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడును నిందితుడిగా చేర్చినట్లు చెబుతున్నారు. గండిపేటకు చెందిన నిమ్మల దశరథ కుటుంబ సభ్యులు ఈ భూమి తమదంటూ కొన్నాళ్లుగా చెబుతున్నారని

అంటున్నారు. దీనిపై వారు హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. హైకోర్టులో రిట్ పెండింగులో ఉండగా, నకిలీ జీవోలతో అమ్మేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. నిమ్మల కుటుంబ సభ్యుల నుంచి భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతోనే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు కేసులో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివాదాస్పద భూమిని కొనుగోలు చేసేందుకు రూ.4 కోట్లు అడ్వాన్స్ చెల్లించడంతో పోలీసులు ఆయనను నిందితుడిగా చేర్చారని అంటున్నారు. దీంతోనే బొల్లా అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172

పబ్లిక్ వ్యూ డెస్క్:

వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాధుడు కూడా అక్కడ లేదు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళ్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

**గుడివాడలో నాని చేతులెత్తేశారా....**

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల

సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది. గత ఎన్నికల్లో తన ఓటమిని జీర్ణించుకోలేని కొడాలి నాని తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు తనను ఓడించడంపై ఒకింత అసంతృప్తితో తొలుత ఉన్నప్పటికీ

ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయిన తర్వాత గుడివాడకు పూర్తి దూరం పాటిస్తున్నారు. విజయవాడ వరకూ వచ్చి గుడివాడకు వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఇప్పుడు గుడివాడకు వచ్చినా చేసేదేమీ లేదని, ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ నుంచి అనుమతి కూడా కొడాలి నాని తీసుకున్నట్లు తెలిసిం

# మే నెలలో తలనీలాల రికార్డు

పబ్లిక్ వ్యూ డెస్క్: తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్‌సీ, హెచ్‌వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

# కాబోయే అల్లుడికి ట్రాఫిక్ ఉల్లంఘనలా... ఇదేమి అంటూ ప్రశ్న

పబ్లిక్ వ్యూ డెస్క్: ళ్లికాని అబ్బాయిలూ మీకో ముఖ్యమైన గమనిక.. మీకు పిల్లనివ్వబోయే మామ మీ ఉద్యోగం, ఆస్తి, అలవాట్ల గురించి మాత్రమే కాదు.. మీపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయో కూడా తెలుసుకుంటున్నారు. మీరు ఉంటున్నది నిజమే.. తాజాగా కాకినాడకు చెందిన ఓ వ్యక్తి తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీస్తే.. అతడిపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయా, లేదా కూడా ఆరా తీశఆరు.సాధారణం ఆడపిల్లకు పెళ్లి సంబంధాలు చూసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటారు. పెద్దవాళ్లు చెప్పినట్లుగా అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల సంగతి పక్కన పెడితే.. అబ్బాయి గుణగణాలు, అలవాట్లు వంటి అంశాలను తెలుసుకునే ప్రయత్నం కచ్చితంగా చేస్తుంటారు. కొంతమంది అబ్బాయి జీతం ఎంత, ఆస్తి ఎంత అని కూడా ఆరా తీసేవాళ్లు ఉంటారు. తమ బిడ్డ భవిష్యత్ బావుండాలనే ఉద్దేశంతోనే అమ్మాయి తల్లిదండ్రులు ఇలా అబ్బాయి గురించి ఎంక్వైరీ చేస్తుంటారు. కానీ కాకినాడ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మాత్రం అలా కాదు.. తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీసేందుకు.. విచిత్రంగా యువకుడు నడిపే బైక్, కారుపై ఏవైనా చలానాలు ఉన్నాయి అంటూ ఆరా తీశారు. నేరుగా సీఐ దగ్గరకు వెళ్లి కాబోయే అల్లుడి గురించి అడిగి తెలుసుకున్నారు.కాకినాడలోని రాయుడుపాలేనికి చెందిన ఓ వ్యక్తి కూతురికి పెళ్లి చేద్దామని ఓ సంబంధం చూశారు. ఈ క్రమంలో తనకు కాబోయే అల్లుడి గురించి తెలుసుకోవాలనుకున్నారు. కాకపోతే ఆయన ఆ యువకుడి గుణగణాలు తెలుసుకోవడంతో పాటుగా కాస్త వినూత్నంగా ఆలోచించారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ నిబంధనలు ఎలా పాటిస్తున్నాడా.. వాహనాలు ఎలా నడుపుతున్నాడో తెలుసుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట కాకినాడ భానుగుడి దగ్గర విధుల్లో ఉన్న ట్రాఫిక్-2 సీఐ డి రామారావును ఆయన కలిశారు. తనకు కాబోయే అల్లుడికి ఓ కారు, ఓ బైక్ ఉందని.. వాటి రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలు సీఐకి ఇచ్చారు. ఈ రెండు వాహనాలపై ఏమైనా చలానాలు ఉన్నాయేమో చెక్ చేయాలని కోరారు. ఒకవేళ ఈ వాహనాలపై చలానాలు ఉంటే కనుక తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయనని సీఐతో చెప్పారు. ఆయన చెప్పిన మాటతో సీఐ కూడా అవాక్కయ్యారు.సీఐ రామారావు వెంటనే స్పందించి.. ఇలా ఎందుకు చేస్తున్నారు, కాబోయే అల్లుడి వాహనాలపై చలానాల గురించి ఎందుకు ఆరా తీస్తున్నారని ఆయనను అడిగారు. తన భార్య చనిపోయిందని.. తనకు ఒక్కగానొక్క కుమార్తె ఉందన్నారు. ఆమెను అల్లారుముద్దుగా పెంచుకున్నానని.. ఆమెకు పెళ్లి చేసే సమయంలో, అన్నీ చూసుకోవాలి కదా అన్నారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే ఆ అబ్బాయి చేతిలో పెట్టాలని అనుకుంటున్నానన్నారు. ఇలా ఆ తండ్రి కూతురిపై ఉన్న ప్రేమను వ్యక్తపరిచారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తాను భావిస్తానన్నారు. అప్పుడు తన కుమార్తెను బాగా చూసుకుంటాడని తనకు నమ్మకం ఉంటుందని సీఐ రామారావుతో చెప్పారు.వెంటనే సీఐ రామారావు కూడా చాలా పాజిటివ్‌గా స్పందించారు. ఆయన ఇచ్చిన రెండు నంబర్లతో చెక్ చేసి.. ఆ రెండు వాహనాలపై ఎలాంటి చలానాలూ లేవని చెప్పారు. దీంతో ఆయన చాలా ఆనందంగా అక్కడి నుంచి వెళ్లారు. కూతురి భవిష్యత్ కోసం ఒక తండ్రిగా చాలా గొప్పగా ఆలోచించారని.. ప్రతి ఒక్కరూ ఇలా ఆలోచిస్తే బావుటుందని సీఐ రామారావు అన్నారు. మొత్తం మీద కాకినాడకు చెందిన పెద్దాయన తన కూతురి భవిష్యత్ కోసం ఇంత దూరం ఆలోచించారా అంటూ చర్చించుకుంటున్నారు.

# కృష్ణా , విజయనగరం రైతులకు జపాన్ ఎఫెక్ట్...

పబ్లిక్ వ్యూ డెస్క్: భారత మామిడి పండ్లపై జపాన్ ప్రభుత్వం విధించిన తాజా నిషేధం ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఖమ్మం విజయనగరం జిల్లాల మామిడి రైతులకు మరియు ఎగుమతిదారులకు పెద్ద షాక్‌గా మారింది. ఏపీలో అత్యధికంగా పండే, ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న 'బంగినపల్లి' రకం మామిడి కాయల ఎగుమతులపై ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ తీయనుంది. జపాన్ మార్కెట్‌లో ఏపీ మామిడి పండ్లకు చాలా ఎక్కువ ధర లభిస్తుండటంతో, ఈ నిషేధం వల్ల ఇక్కడి వ్యాపారులు, రైతులు కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.నిజానికి ఏపీ నుండి జపాన్‌కు మామిడి కాయలను ఎగుమతి చేసే ముందు నాణ్యతా ప్రమాణాల కోసం వాటికి వేపర్ హీట్ ట్రీట్మెంట్ చేయడం తప్పనిసరి. అయితే, ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రీట్మెంట్ ప్లాంట్‌లో క్వారంటైన్ నిబంధనలు, పురుగుల నివారణ ప్రక్రియల్లో లోపాలు ఉన్నట్లు జపాన్ ఫుడ్ అఫీషియల్స్ గుర్తించారు. జపాన్ దేశం పండ్ల ఈగల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తుంది. ఒక ప్రాంతంలో లోపం జరిగినా, దాని ప్రభావం దేశవ్యాప్త ఎగుమతులపై పడటంతో ఏపీలోని అత్యాధునిక ప్యాక్ హౌస్‌ల ద్వారా ఎగుమతి చేసే రైతులు కూడా ఇప్పుడు నష్టపోవాల్సి వస్తోంది.ఈ ఏడాది ఇప్పటికే ఏపీలోని మామిడి రైతులకు వాతావరణం ఏమాత్రం కలిసిరాలేదు. ఎల్ నినో ప్రభావం వల్ల మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన విపరీతమైన ఎండలు, అకాల వాతావరణ మార్పుల కారణంగా పూత ఎండిపోయి, కాయ రాలిపోయి ఇప్పటికే 60 శాతం పైగా పంట నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతులకు, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర దక్కుతుందనే ఆశ ఉండేది. కానీ కచ్చితంగా సీజన్ పీక్ స్టేజ్‌కు చేరే సమయంలో జపాన్ ఈ నిషేధాన్ని విధించడం ఏపీ మామిడి రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.ఇప్పుడు ఏపీ ఎగుమతిదారులు భయపడుతున్న మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. జపాన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా భారతీయ క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌పై నమ్మకం తగ్గే అవకాశం ఉంది. జపాన్ బ్యాన్‌ను చూసి ఏపీ మామిడిని భారీగా దిగుమతి చేసుకునే ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలు లేదా గల్ఫ్ దేశాలు కూడా తనిఖీలను కఠినతరం చేస్తే ఏపీ మామిడి మార్కెట్ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏపీ ప్రభుత్వం, అపెడా అధికారులు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడి, ఈ సాంకేతిక లోపాలను సవరించి జపాన్‌తో మళ్లీ చర్చలు జరపాలని రైతులు కోరుతున్నారు.



మీనాక్షి చౌదరి క్లాసిక్ చీర లుక్‌లో టైమ్‌లెస్ గాంభీర్యాన్ని ప్రసరిస్తుంది

# చేపల మార్కెట్‌కి వెళ్లి మాకు నచ్చే చేపలు కొని తెచ్చేది!- జాన్వీ



భారతీయ సినీపరిశ్రమలో తనదైన అద్భుత నటన, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ కిడ్ జాన్వీ కపూర్ తాజాగా తన తల్లి, దివంగత నటి శ్రీదేవి గురించి సంచలన విషయాలను షేర్ చేసారు. ప్రస్తుతం టాలీవుడ్ – బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న జాన్వీ ఒక ఇంటర్వ్యూలో తన తల్లి వారసత్వాన్ని మోయడంపై మనసు విప్పారు. సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టినప్పటి నుండి తన తల్లి ఇమేజ్‌తో ఎదురవుతున్న పోలికలు, తన వ్యక్తిగత ఎదుగుదల.. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ సరసన –పెద్ది– వంటి భారీ చిత్రాలలో నటిస్తున్న తరుణంలో తన ఆలోచనా విధానం ఎలా ఉందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిన్నతనంలో తన తల్లి శ్రీదేవి ఎంతటి పెద్ద సూపర్‌స్టారో.. దేశవ్యాప్తంగా మామ్‌కు ఎంతటి క్రేజ్ ఉందో తనకు అస్సలు తెలిసేది కాదని జాన్వీ కపూర్ చెప్పారు. తాము ఎంత పెద్ద స్టార్ ఫ్యామిలీకి చెందినవారమైనా ఇంట్లో మాత్రం సినిమా వాతావరణాన్ని తల్లి ఎప్పుడూ దూరంగానే ఉంచేదని.. ఒక సాధారణ తల్లిలాగే తమను చూసుకునేదని వెల్లడించారు. మాకు అమ్మ సూపర్‌వుమన్ ఎందుకు అంటే.. ప్రతి శుక్రవారం ఫిష్ మార్కెట్‌కు వెళ్లి వంటకు ఏ రకం ఫిష్ బాగుంటుందో స్వయంగా ఎంపిక చేసి తీసుకురావడం. ఆ పనులన్నీ చేయడంలో అమ్మ ఎంతో గర్వంగా, సంతోషంగా ఫీల్ అయ్యేది! అని జాన్వీ తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను స్వయంగా నటనా రంగంలో అడుగుపెట్టి నటిగా పని చేయడం ప్రారంభించాకనే.. అసలు తన తల్లి ప్రేక్షకులకు ఎంతటి ఆరాధ్య దైవమో.. వారి జీవితాల్లో ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉందో పూర్తిగా అర్థం కావడం ప్రారంభమైందని జాన్వీ అన్నారు. వెండితెరపైనే కాకుండా.. సాధారణ ప్రజల మనసుల్లో శ్రీదేవి పై ఉన్న అపారమైన ప్రేమాభిమానాల గురించి తెలుసుకోవడం ఒక గొప్ప బ్లెస్సింగ్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి అపారమైన ప్రజాదరణ తరాలకోసారి.. ఎప్పుడో ఒకసారి మాత్రమే సాధ్యమవుతుందని.. తన తల్లి సృష్టించిన ఆ మ్యాజిక్‌ను మళ్లీ రీ-క్రియేట్ చేయడం ఎవరికైనా దాదాపు అసాధ్యమని జాన్వీ స్పష్టం చేశారు. సినిమా రంగంలో తనను నిరంతరం తల్లి శ్రీదేవితో పోల్చడంపై జాన్వీ కపూర్ ఎంతో మెచ్యూర్డ్‌గా సానుకూల దృక్పథంతో స్పందించారు. చిత్ర పరిశ్రమలో ఎవరినో ఒకరితో పోల్చడం చాలా సహజమైన విషయమేనని జాన్వీ పేర్కొన్నారు. నన్ను భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్‌తో పోలుస్తున్నప్పుడు.. నేను దానిని ఒక అదృష్టంగా భావిస్తాను. ఆ పోలికలు నన్ను మరింత కష్టపడటానికి నా నటనను ప్రతి సినిమాకు మెరుగుపరుచుకోవడానికి ఒక గొప్ప ఎనర్జీని, మోటివేషన్‌ను ఇస్తాయి తప్ప అందులో ఎలాంటి నెగిటివిటీ లేదు! అని జాన్వీ చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం తాను ఏ సినిమా చేసినా పూర్తి స్థాయి నిజాయితీతో చేస్తున్నానని.. నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ కిడ్ అనే ట్యాగ్ ..శ్రీదేవి ఇమేజ్ తెచ్చే ఒత్తిడిని నెగిటివ్‌గా తీసుకోకుండా తన కెరీర్‌కు అదొక ఇంధనంగా మార్చుకున్నానని జాన్వీ కపూర్ చెప్పిన విధానం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, మునుముందు నటిగా మరిన్ని శిఖరాలను అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. చరణ్– జాన్వీ జంటగా నటించిన పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



గోల్డెన్ గౌన్ బీచ్ ఫోటోషూట్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ స్టన్స్

## బ్యాక్ టు బ్యాక్ ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన జట్లు ఇవే.. ధోని, రోహిత్ క్లబ్‌లో ఆర్‌సీబీ చేరేనా?





**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఐపీఎల్ 2026 ఆఖరి అంకానికి వచ్చేసింది భయ్యా. రెండు నెలల సంబురానికి రేపటితో ఎండ్ కార్డు పడబోతుంది. మే 31 (ఆదివారం) నాడు అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియంలో రజత్ పాటిదార్ నాయకత్వంలోని ఆర్‌సీబీ, శుభ్‌మన్ గిల్ సారథ్యంలో గుజరాత్ టైటాన్స్ ట్రోఫీ కోసం గట్టిగ కుస్తీ పడబోతున్నాయి. క్వాలిఫయర్-1లో గుజరాత్‌ని ఘోరంగా ఓడించి ఫైనల్ కి బెంగళూరు చేరింది. ఒకవేళ రేపు గనుక మ్యాచ్ గెలిస్తే ఆర్‌సీబీ పోరగాళ్లు హిస్టరీ క్రియేట్ చేస్తారు. వరుసగా రెండో ఏడాది కప్పు కొట్టి, ఐపీఎల్ చరిత్రలోనే ఒక కిర్రాక్ రికార్డును పైసా వసూల్ రేంజ్ లో సొంతం చేసుకునే గోల్డెన్ ఛాన్స్ పాటిదార్ సేన ముందుంది.

**ధోని, రోహిత్ ఎలైట్ క్లబ్‌లో పాటిదార్ చేరేనా?:**

ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండు సార్లు కప్ కొట్టి టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న రికార్డు కేవలం రెండు జట్లకు మాత్రమే ఉంది. ఒకవేళ ఆర్‌సీబీ గనుక రేపు గెలిస్తే, రజత్ పాటిదార్ నేరుగా మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మల పక్కన కుర్చీ వేసుకుని కూర్చునే అవకాశం దక్కుతుంది.

**18 ఏండ్ల కల నెరవేరింది:**

2025లో 18 ఏండ్ల శాపాన్ని బద్దలు కొట్టి ఫస్ట్ టైటిల్ ముద్దాడిన ఆర్‌సీబీ.. ఈసారి కూడా అదే ఊపులో ఉంది. మరి ధోని, రోహిత్ ల తర్వాత వరుసగా రెండోసారి ఐపీఎల్ సామ్రాజ్యాన్ని ఏలబోయే ఆ మూడో కెప్టెన్‌గా పాటిదార్ నిలుస్తాడా లేదా అనేది రేపు రాత్రికి తేలిపోతది.

**లాస్ట్ బాల్ థ్రిల్లర్ రివెంజ్?:**

మరోవైపు శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఊరికే వదిలేలా లేదు.. వాళ్ళ హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్ కాబట్టి మస్తు కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. 2022లో ఐపీఎల్‌లోకొచ్చిన డెబ్యూ సీజన్ లోనే కప్పు కొట్టి రచ్చ లేపిన గుజరాత్, 2023లో కూడా వరుసగా రెండోసారి కప్ కొట్టేలా కనిపించింది. కానీ ఆ ఫైనల్లో సీఎస్‌కే చేతిలో లాస్ట్ బాల్ థ్రిల్లర్‌లో ఓడిపోయింది.

**కసితో రగిలిపోతున్న గిల్ సేన:**

మళ్లీ మూడేండ్ల తర్వాత గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్ లో అడుగు పెట్టింది. ఐదు సీజన్లలో వీరికి ఇది మూడో ఫైనల్ మ్యాచ్ కావడం విశేషం. క్వాలిఫయర్-1 లో ఆర్‌సీబీ చేతిలో ఓడిపోయినప్పటికీ, క్వాలిఫయర్-2లో రాజస్థాన్‌ను ఓడించి, మళ్లీ గిల్ సేన ఫైనల్ లోకి ఎంట్రీ ఇచ్చింది. కాబట్టి తమ సొంత స్టేడియంలో ఆర్‌సీబీని బోల్తా కొట్టించాలని గుజరాత్ టైటాన్స్ జట్టు కసితో ఉంది.

## ఐపీఎల్ ఫైనల్స్‌లో కింగ్ కోహ్లీ రికార్డు ఇదే.. గుజరాత్‌తో ఫైట్‌కు ముందు విరాట్ హిస్టరీ డీకోడ్!

**పబ్లిక్ వ్యూ డెస్క్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఐపీఎల్ 2026 ఫైనల్ కి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. రజత్ పాటిదార్ కెప్టెన్సీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఫైనల్‌లోకి దూసుకెళ్లి హిస్టరీ క్రియేట్ చేయడానికి సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతున్న ఆర్‌సీబీ ఆశలన్నీ ఎప్పటిలాగే కింగ్ విరాట్ కోహ్లీపైనే ఉన్నాయి. మరి ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు ఐపీఎల్ ఫైనల్స్ ప్రెజర్‌లో కోహ్లీ ట్రాక్ రికార్డ్ ఎలా ఉందో ఇప్పుడు తెలుసుకుందాం..



**కోహ్లీ ఐపీఎల్ ఫైనల్స్ జర్నీ:**

కోహ్లీ ఇప్పటి వరకు ఆడిన 4 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌లలో 34.75 సగటుతో మొత్తం 139 రన్స్ మాత్రమే చేశాడు. కెరీర్ మొదటి పదేళ్లలో ఫైనల్స్ అంటే కోహ్లీకి కేవలం గుండెకోత మాత్రమే మిగిలింది. కానీ గత ఏడాది (2025) జరిగిన ఫైనల్ మ్యాచ్ అతని తలరాతను పూర్తిగా మార్చేసింది.

**ఫైనల్స్‌లో కోహ్లీ రికార్డు:**

2009 (ఆర్సీబీ జం డెక్కన్ చార్జర్స్): అప్పట్లో కోహ్లీ కేవలం ఒక టీనేజ్ బ్యాటింగ్ సెన్సేషన్ మాత్రమే.. ఆ ఫైనల్‌లో ఆర్‌సీబీ చేతుల్లో ఉన్న మ్యాచ్‌ను చేజార్చుకుని రన్నరప్‌గా నిలిచింది.

2011 (ఆర్సీబీ జం చెన్నై సూపర్ కింగ్స్): సీఎస్‌కే విధించిన భారీ టార్గెట్ ఛేజింగ్‌లో కోహ్లీ 35 పరుగులతో పోరాట పటిమ చూపించినా.. లాభం లేకుండా పోయింది. చెన్నై ఘన విజయం సాధించింది.

2012--2016 ( ఆర్సీబీ జం సన్‌రైజర్స్ హైదరాబాద్): 2016 ఫైనల్‌లో కోహ్లీ చెలరేగి ఆడి 35 బంతుల్లో 54 పరుగులు సాధించాడు. కానీ, డేవిడ్ వార్నర్ ఆర్మీ ఆర్‌సీబీ కప్ చెదరగొట్టింది.

2025 (ఆర్సీబీ జం పంజాబ్ కింగ్స్): గత ఏడాది ఫైనల్‌లో కోహ్లీ పరుగులు చేయడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు. 35 బంతుల్లో 43 రన్స్ నెమ్మదైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు, అలాగే బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, కృనాల్ పాండ్యా మ్యాజిక్ చేయడంతో ఆర్‌సీబీ ఎట్టకేలకు తమ ఫస్ట్ ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకుంది.

**ఫైనల్ లో ప్రెజర్లో కోహ్లీ నిజమేనా?:**

ఐపీఎల్ హిస్టరీలోనే కోహ్లీ పరుగుల రారాజు అనడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ, నార్మల్ మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్స్‌లో అతని అగ్రెసివ్ నెస్, కన్సిస్టెన్సీ కొంచెం తగ్గినట్లు పలు గణాంకాలు చెప్తున్నాయి.

ఓవరాల్ కెరీర్‌లో 134o స్ట్రైక్ రేట్ ఉన్న కోహ్లీ.. ఫైనల్స్ మ్యాచ్‌లకు వచ్చేసరికి 126.36 స్ట్రైక్ రేట్‌తో కాస్త నెమ్మదించాడు. ఖగత ఏడాది ఫైనల్స్ (2025) లో కూడా ఫ్లాట్ పిచ్‌పై విరాట్ కోహ్లీ 35 బంతుల్లో 43 రన్స్ చేయడమే దీనికి ఉదాహరణ.

**ఫైనల్ గేమ్ చేంజర్:**

ఫైనల్స్ రికార్డ్స్ ఎలా ఉన్నా.. ఈసారి గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌లో కోహ్లీనే ఆర్‌సీబీకి లార్జర్– దన్ –లైఫ్ వెపన్. ఎందుకంటే గుజరాత్ టీమ్‌లో కగిసో రబాడ, మహమ్మద్ సిరాజ్ వంటి స్పీడ్‌తో భయపెట్టే 'రా పేస్' బౌలర్లు ఉన్నారు. కానీ కోహ్లీకి ఇలాంటి ఎక్స్‌ప్రెస్ పేస్‌ను ఎదుర్కోవడం వెన్నతో పెట్టిన విద్య.. ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్‌పై కోహ్లీ ట్రాక్ రికార్డ్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ సీజన్‌లో గుజరాత్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల్లో కోహ్లీ ఏకంగా 82 బంతుల్లో 152 రన్స్ కొట్టాడు. రబడా, సిరాజ్ వేసే పవర్‌ప్లే ఓవర్లలోని స్పీడ్‌ను కోహ్లీ గనుక ఈజీగా న్యూట్రలైజ్ చేస్తే.. అహ్మదాబాద్ గ్రౌండ్‌లో పరుగుల వరద పారడం ఖాయం.

## టీమిండియా నుంచి గిల్, సూర్య ఔట్.. వైభవ్ కి రెడ్ కార్పెట్

**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఐపీఎల్-2026 సీజన్ తుది దశకు చేరుకోవడంతో ఇప్పుడు అందరి దృష్టి భారత జట్టు పర్యటనలపై పడింది. ఈ ఏడాది ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమిండియా వరుస సిరీస్ లతో బిజీబిజీగా గడపనుంది. మొదట స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్ తో ఒక టెస్ట్, 3 వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వేలలో ఇండియన్ టీమ్ పర్యటించనుంది. ఈ ఏడాది భారత జట్టుకి అత్యంత కీలకమైన టోర్నమెంట్లలో ఏషియన్ గేమ్స్ (Asian Games) ఒకటి.. ఈ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ వేదికగా కొనసాగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ కోసం 30 మంది ప్లేయర్స్ తో కూడిన ప్రాబబుల్స్ జాబితాను బీసీసీఐ సెలక్షన్ కమిటీ రెడీ చేసినట్లు టాక్. లిస్టులో టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, టెస్టు, వన్డే సారథి శుభ్ మన్ గిల్ కి స్థానం దక్కకపోవచ్చనే టాక్ వినిపిస్తుంది. ఐపీఎల్ 2026లో దుమ్ములేపిన



15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని బీసీసీఐ షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తుంది. వైభవ్ తో పాటు జైస్వాల్, శాంసన్, ఇషాన్, అభిషేక్, బుమ్రా, హార్దిక్, శ్రేయస్, నితీశ్, అక్షర్ వంటి స్టార్ క్రికెటర్లు కూడా ఈ ఏడాది ఆసియా గేమ్స్ ఆడనున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ 30 మంది లిస్టు నుంచే 15 మంది సభ్యుల జట్టును సెలక్ట్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ ఆసియా క్రీడల కోసం జట్టుని ప్రకటించేందుకు జూన్ 10 చివరి తేదీగా ఫిక్స్ చేసినట్లు టాక్. ఈ టోర్నీ సమయంలోనే టీమిండియా సీనియర్ టీమ్ వెస్టిండీస్ పర్యటనకి వెళ్లనుంది. ఈ టూర్ లో భాగంగా ఆతిథ్య విండీస్ తో 5 టీ20లు, 3 వన్డేలని భారత్ ఆడనుంది. సెప్టెంబర్ 27న ఇండియా-- విండీస్ పర్యటన స్టార్ట్ అవుతుంది. తొలుత వన్డే సిరీస్ జరిగిన తర్వాత అక్టోబర్ 6 నుంచి టీ20 మ్యాచులు జరుగుతాయి. ఈ సిరీస్ సమయానికి అభిషేక్ శర్మ, సంజు శాంసన్ లాంటి స్టార్ ఆటగాళ్లు ఏషియన్ గేమ్స్ ముగించుకుని జట్టుతో చేరే ఛాన్స్ ఉంది.

On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653